# డొల్ల

-ప్రతాప రవిశంకర్

చీకట్లు ముసురుకుంటున్నవేళ మోళీసాయిబు పొలిమేరదాటి తన కుటుంబంతో ఆ వూళ్లోకి ప్రవేశించాడు. భుజంమీది కావిడితో ముందు సాయిబు, వెనుక భార్య, ఇద్దరు పిల్లలు. భార్య నెత్తిమీద పెద్దమూట. పిల్లల భుజాలకు వేల్లాడుతున్న జోనెల్లాంటి సంచులు.

మట్టిరోడ్డు గతుకులుగా ఉంది. రోడ్డుకు రెండు వైపులా రిబ్బను లాంటి కాలవ. అందులో అక్కడక్కడ నిలచివున్న నీళ్లలో వుండి వుండి కప్పలు అరుస్తున్నాయి.

కావిడిని భుజం మార్చుకున్నాడు సాయిబు. ఆ కావిడికి ఒకవైపు ఉన్న గోనెసంచిలో అతను ప్రదర్శించే గారడీ విద్య తాలూకు సరంజామా వుంది. రెండోవైపున వంట పాత్రలూ వగైరా ఉన్నాయి.

ఊరికి రెండున్నర కిలోమీటర్ల దూరంలోవున్న అడ్డరోడ్డు దగ్గిర బస్సుదిగేనరికే పొద్దువాలిపోతుంది. కార్తీక మాసం వెళ్లి మార్గశిరం వస్తుండటంతో వెలుతురు బాగా తగ్గిపోయింది.

ఆ మర్నాటి ఉదయం ఆ వూళ్లో సాయిబు తన గారడీ ప్రదర్శన ఇవ్వాలనుకున్నాడు. అందుకు ముందుగానే వెళ్లి తగిన ఏర్పాట్లు చేసుకోవాలి.

సాయిబు భుజంమీది కావిడి వూగుతోంది. ఎవరో కదిలిస్తున్నట్టు. అతడి మొహంమీదినించి చెమట బద్ధకంగా కిందికి జారుతోంది.

కొంచెం దూరంలో వున్న ఇళ్లలో వెలుగుతున్న దీపాలు మిణుకుమిణుకు మంటున్నాయి. ఊళ్లోని సందడీ, అప్పుడప్పుడు ఎవరో అరుస్తున్న కేకలూ వినపడుతున్నాయి.

పిల్లలిద్దరూ అలికిడికి నీళ్లలో దూకుతున్న కప్పలను చూస్తూ నడుస్తున్నారు. అప్పుడప్పుడు వెనకపడి మళ్లీ ముందుకు పరుగుపెడుతున్నారు.

సాయిబు భార్యకు అలసటగా వుంది ఎందుకనో ఈ మధ్య కొంచెం దూరం నడిస్తేనే ఆమెకు అలసట అనిపిస్తోంది. ఏదో అనారోగ్యం తనలో ప్రవేశించిందని ఆమె గ్రహించి ఆ మాటే సాయిబుతో చెప్పింది కొన్ని రోజులక్రితం. కొంచెం డబ్బు చేతికి చిక్కినాక మంచి వైద్యుడికి చూపించి మందులు రాయిస్తానన్నాడు సాయిబు. అందులో భాగంగానే ఇప్పుడు వెళుతున్న వూళ్లో తన గారడీ ప్రదర్శన పెట్టాలని అనుకున్నాడు. అతనికి ఎవరో చెప్పారు ఆ వూరు బాగా బలిసిన వూరనీ, వూళ్లోని చాలా మంది డబ్బున్నవాళ్లనీ.

పల్లెటూళ్లలో గారడీ విద్యను ప్రదర్శించటం సాయిబుకు కొత్తకాదు. ఇంతకు ముందు ఎన్నో వూళ్లలో తన మోళీ విద్యను ప్రదర్శించాడు. ఎంతో మందిని మెప్పించాడు. కానీ, అతను ఎక్కువగా పట్టణాల్లోనే తన విద్యను ప్రదర్శిస్తాడు. ఎందుకంటే అక్కడే నాలుగు సెంటర్లలో ఒకే రోజు నాలుగు ప్రదర్శనలు ఇచ్చే అవకాశం ఉంది. కానీ, పల్లెటూళ్లో ఒక్క ప్రదర్శన కంటే అవకాశం వుండదు.

ఐనా బాగా డబ్బున్న మనుషులు గల వూళ్లో ప్రదర్శన ఇస్తే డబ్బులు బాగా వస్తాయనీ, వాటితో భార్యను డాక్టరుకు చూపించవచ్చునీ సంకల్పించాడు సాయిబు.

చీకటి ఇంకొంచెం చిక్కబడింది. ఆ దారిని పూర్తిగా కప్పివేసింది. ఊరు మరింత చేరువయింది.

అప్పుడే ఎవరో ఒకాయన వాళ్లకు ఎదురు వచ్చాడు. సాయిబు ఆయన్ని ఆపి ముందు తనగురించి చెప్పుకున్నాడు. ఆపైన ఆ వూళ్లో తనకు అవసరమయిన వసతి గురించిన వివరాలను అడిగి తెలుసుకున్నాడు. చివరగా ఆవూరి సర్పంచి గారి పేరును అడిగాడు. బంగారురాజని చెప్పి చీకట్లో కలసిపోయాడాయన.

ఆయనతో మాట్లాడుతున్నంత సేపూ సాయిబు భుజంమీది కావడి కుదురుగా వుంది. తిరిగి కదలడంతో అది కూడా కదిలి ముందుకు

సాగింది. అతనితోపాటే భార్యా, పిల్లలూ....

చప్టామీదికి వచ్చారు వాళ్లు. వెడల్పుగా వున్నవాగు. నీళ్లు పలచగా వున్నాయి. నిశ్చలంగా వున్న నీళ్లలో వాగు వొడ్డున వెలుగుతున్న వీధి దీపం ప్రతిబింబం అగుపడుతోంది. కొంచెం దూరంలో ఒకే రకమైన ఇళ్లతో ఉన్న ఏదో కాలనీ, మైదానంలో పిల్లలు ఆడుకుంటున్నారు.

పూర్తిగా వూళ్లోకి వచ్చేశారు. అక్కడా అక్కడా వీధి దీపాలు వెలుగుతున్నాయి. రోడ్డుపక్కన వున్న చిన్నచిన్న గుడిసెల బయట కొంత మంది పుల్లలతో రాళ్లపొయ్యిల మీద వంటలు చేస్తున్నారు. గాలికి కదులుతున్న మంట నృత్యం చేస్తున్నట్టుగా వుంది. జిడ్డు కారుతున్న ఆడవాళ్ళ మొహాల మీద మంటతాలూకు ఎరుపు ప్రతిఫలిస్తోంది.

ఆ రోడ్డు చివరంటా నడిచి ఎడమవైపుకు తిరిగాడు సాయిబు. అక్కడి నించి అతనికి అన్నీ పెద్దపెద్ద డాబా ఇళ్లూ, మధ్యలో మేడలూ కనిపించాయి. ఆ ఊరు గొప్పతనాన్నీ, ఆ మనుషుల ధన బలాన్నీ ఆ ఇళ్లు అతనికి చెబుతున్నట్టనిపించాయి. అతనికి కొంచెం సంతోషం కలిగింది.

ఇళ్ల బయట దాదాపుగా ప్రతి ఇంటికీ పొడవుగావున్న అరుగులు వున్నాయి. అరుగుల మీద కొంతమంది ఆడవాళ్ళు కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు చలిగాలికి వంటినిండా కొంగులు కప్పుకుని. మధ్యలో మాటలు ఆపి సాయిబునీ, వెనక నడుస్తున్న భార్యా పిల్లల్నీ కొంచెం నిశితంగా చూశారు. వాళ్లలో ఒక వయసు మళ్లినామె సాయిబును వివరాలడిగింది. చెప్పాడతను మర్నాటి తన గారడీ ప్రదర్శన గురించి.

"ఇంకెక్కడా చెరువు?" అన్నది భార్య సాయిబును. బదులు చెప్పకుండా రోడ్డు మధ్యన నిల్చుని మాట్లాడుకుంటున్న ఇద్దరు మనుషులని చెరువు దారిగురించి అడిగాడు సాయిబు.

చేత్తో దారి చూపించాడు ఒకాయన.

ఇంకొంచెం దూరం నడిచేసరికి ఆ వూరి సెంటర్ వచ్చింది.

పెద్ద మర్రిచెట్టు, దాని చుట్టూ నలు చదరంగా కట్టిన అరుగు. దానిపక్కనే రంగు వెలిసిపోయిన గాంధీ గారి విగ్రహం. ఆ పక్కనే రెండు బడ్డీకొట్లు. ఇంకో వైపు రేకుల కప్పువేసిన హోటలూ.

మర్రిచెట్టుకింద కూర్చుని కొంతమంది గోలగోలగా మాట్లాడుకుంటున్నారు. చెట్టుమీద కాకులు గోలగోలగా అరుస్తున్నాయి.

సాయిబు పిల్లలు బడ్డీకొట్లోవున్న గాజు సీసాల్లోంచి అగుపడుతున్న రకరకాల తినుబండారాలను ఆసక్తిగా మెరిసే కళ్లతో చూస్తూ ఆగిపోయి తండ్రి అదిలించడంతో అయిష్టంగానే ముందుకు కదిలారు.

ఆ వీధికూడా విశాలంగానే వుంది. కొన్ని ఇళ్లబయట పశువులు కట్టుకొయ్యకు అటూ ఇటూ తిరుగుతూ అరుస్తున్నాయి. ఆ ఇళ్లముందున్న సైడుకాలవలో మురుగు నిలబడిపోయి వాసన కొడుతోంది. ఒక ఇంటి బయట రోడ్డు చివర్న గోచీ పెట్టుకుని స్నానం చేస్తున్న మనిషిని సాయిబు పిల్లలు ఆశ్చర్యంగా చూశారు.

ఎదురుగా గుడి కనవడింది. గుడిగోపురంమీద వెలుగుతున్న లైటు వెలుతురు మందకొడిగా వుంది. లైటు చుట్టూ లెక్కలేనన్ని పురుగులు ముసురుకుని వున్నాయి. ఇక చెరువు వచ్చేసిందనుకున్నాడు సాయిబు. భార్యతో చెప్పాడు.

గుడిదాటగానే పాడుబడిన సత్రం. ఆ సత్రం ముందు ఎత్తుగా పెరిగిన రెండు రావిచెట్లు. వాటికింద కొంత మంది బిచ్చగాళ్లు ఏరుకొచ్చిన పుల్లలతో మంటపెట్టి వంట చేసుకుంటున్నారు అడుక్కొచ్చిన బియ్యంతో. తన వసతిని గుర్తించాడు సాయిబు.

"వచ్చేశాం" అన్నాడతను నిటూర్చి.

రోడ్డుపక్కనే గుడి గోడను ఆనుకొని పొదల్లాగా పెరిగిన తుమ్మచెట్లున్నాయి. ఆ ముళ్లకంప మధ్యలో దర్జీలు పారేసిన గుడ్డపీలికలూ, చినిగిపోయిన తుంగచాప ముక్కలూ వేల్లాడుతూ గాలికి కదులుతున్నాయి. వాటిని దాటగానే సత్రానికి వెళ్లేదారి చెట్ల మధ్యగా కనపడింది.

కావిడి తుమ్మచెట్లమధ్య ఇరుక్కోకుండా లాఘవంగా నడిచాడు సాయిబు. భార్యాపిల్లలూ

సాయిబును అనుసరించి గమ్యాన్ని చేరినందుకు చిన్నగా నిట్టూర్చారు.

పాడుబడిన సత్రం వాళ్లకి గొప్ప భవంతిలా గోచరించింది. వెనుక వైపున వున్న చిన్న గదులు పడిపోయినా వాటి ముందున్న పొడవాటి హాలు బాగానే వుంది. అందులోనే ఒకవైపు గంజాయి దమ్ము కొట్టే సాధువుల జోలెలూ, అడుక్కునే చిప్పలూ చిందరవందరగా పడివున్నాయి. ఇంకోవైపు బాగానే వుంది ఖాళీగా- మధ్యలో ఇద్దరు ముసలి బిచ్చగాళ్లు తమ వాళ్లు అడుక్కుని తెచ్చే అన్నం కోసం ఎదురు చూస్తూ పడుకుని పైకి చూస్తున్నారు.

కింద గచ్చులేదు. నేలంతా దుమ్ములేచి వుంది. గోడలకు పెచ్చు వూడిపోయింది.

భుజం మీద కావిడితో దర్శనం ఇచ్చిన సాయిబునీ, అతని భార్యా పిల్లల్నీ అన్నాలు వండుకుంటున్న వాళ్లూ, ఇతర సాధువులూ స్నేహ పూర్వకంగా చూశారు.

ఖాళీగా కనపడిన ఆ సత్రం హాలులోకి వాళ్ళు చేరిపోయారు. కావిడి కిందికి దిగింది. భుజాలను కొంచెంసేపు రుద్దుకున్నాడు సాయిబు. తన బరువు సగానికి సగం తగ్గిపోయినట్లనిపించింది. అప్పటికప్పుడే సాయిబు పెళ్లాం వంట సరంజామా వున్న గోనెసంచిని వూడదీసింది. అప్పటికి రెండుసార్లు పిల్లలు ఆకలవుతోందని తల్లితో చెప్పారు.

సత్రం సరిగ్గా చెరువు కట్టమీద వుంది. చెరువుకీ సత్రానికీ మధ్య ఎక్కువ వెడల్పు లేని నల్ల రేగడి రోడ్డు చీకట్లో మరింత నల్లగా ఉంది. దూరంగా వెలుగుతున్న వీధి దీపాల వెలుగులో చెరువులో నీళ్లు మెరుస్తూ కనపడుతున్నాయి.

గోనె సంచిలో నించి రేకు కడవను తీసి సాయిబుకు ఇచ్చింది భార్య. దాన్ని తీసుకుని అతను చెరువు దగ్గరకు వచ్చాడు. కొంచెం దగ్గరలోనే గుడి వెనుకవైపుగా లోపలకు దిగటానికి మెట్లు కనిపించాయి. చిన్నగా చెర్లోకి దిగి ముందుగా తాను కొంచెం నీళ్లుతాగి తర్వాత కడవతో నీళ్లు ముంచుకుని వచ్చాడు.

తను ముందుగా ఆ వూరి సర్పంచి బంగార్రాజుని కలిసివస్తానని చెప్పి బయలుదేరాడు సాయిబు. అప్పటికప్పుడే సాయిబు భార్య ఎదురుగావున్న రాళ్ళను పొయ్యిలాగాపేర్చి ఆ పూట తిండికి సరిపోను నూకల్ని వండటానికి సిద్ధమవుతోంది.

సాయిబు ఈసారి సత్రం పక్కగా గుడి పక్కనే వున్న రోడ్డుమీద నడక సాగించాడు. గుడిపక్కనే వున్న రామ మందిరం బయట కొంత మంది కూర్చుని ఏవో కబుర్లు చెప్పుకుంటున్నారు. వాళ్లలో ఒకాయన్ని సర్పంచి గారి ఇంటిగురించి అడిగాడు. ఆయన సాయిబు గురించిన వివరాలు తెలుసుకుని సర్పంచి ఇంటి గుర్తులు చెప్పాడు.

సాయిబు గుడిపక్కనుంచి నడుస్తుంటే గుళ్లో అప్పుడే మొదలయిన భజన అతడికి వినిపించింది.

మర్రిచెట్టు సెంటర్‌కు వచ్చి ఇంతకు ముందు తాము వచ్చిన రోడ్డులోకే తిరిగాడు. కొంచెం వెళ్లాక రెండు మూడు మేడలు ఒకే రకంగా ఉండటంతో పోల్చుకోలేక ఎదురుగా వచ్చిన ఒకతన్ని అడిగాడు ఆయనతో తనపనేమిటో చెప్పి.

అతను నవ్వి బంగార్రాజు ఇంటిని చూపించి 'అయినా బంగార్రాజు ఈ టైములో చిన్నింట్లో వుంటాడు. అక్కడకు వెళ్లు దర్శనమిస్తాడు' అని చెప్పాడు.

చిన్నిల్లు అంటే సాయిబుకు తెలుసు. అందుకే ఆ ఇల్లు ఎక్కడో చెప్పమని అడిగాడు.

తనటే వెళుతున్నాననీ, తనతో రమ్మనీ చెప్పి అతను ముందుక్కదిలాడు. సాయిబు అతన్ని అనుసరించాడు. నడుస్తున్నంతసేపూ అతను సాయిబు గారడీ విద్యగురించిన వివరాలను అడుగుతూనే వున్నాడు. చివరకు ఒక ఇంటిని చూపించి చీకట్లో కలిసిపోయేడు.

డాబా ఇల్లు. లోపల ఎక్కడో దీపాలు వెలుగుతున్నాయి. ఇంట్లో మనుషులున్నా అలికిడిలేదు. సందేహిస్తూ సాయిబు రెండు నిముషాలు అక్కడే నిలబడిపోయాడు. ఇంతలో ఎవరో ఒకతను వచ్చాడు "ఎవరక్కడ" అంటూ

తను ఎందుకు వచ్చిందీ చెప్పాడు సాయిబు.

అతను మాట్లాడకుండా గేటు నెట్టుకుంటూ లోపలకు వెళ్లి కొంచెం సేపటికి వచ్చి సాయిబును

లోపలకు తీసుకువెళ్లాడు.

మధ్యగదిలో ఉయ్యాల బల్ల మీద కాళ్లు జారవిడిచి కూర్చుని సిగరెట్టు కాలుస్తున్నాడు బంగా(రాజు. గ్లాస్కోపంచె, గ్లాస్కో చొక్కా వేసుకున్నాడు. మెళ్లో జెర్రిపోతులాంటి బంగారు గొలుసు. దాని చివర పులిగోరు. చేతి వేళ్లకు మెరుస్తున్న ఉంగరాలు. యాభై ఏళ్లకు మించని బంగా(రాజును చూడగానే వొంగి దణ్ణంపెట్టాడు సాయిబు వినయంగా.

"ఎవ(రా నువ్వు?" అడిగాడు బంగా(రాజు దర్పంగా.

చెప్పాడు.

"ఐతే నాతో పనేటి?"

పనేమిటో కూడా చెప్పాడు.

"ఇంతేనా?" తేలిగ్గా అన్నాడు బంగా(రాజు.

"అవును దొరా! తవరు దరమ (ప్రభువులు. మీలాంటి మారాజులు కనికరించి నాలుగు రూకల్ని మా మొకాన విసిరితే మీ పేరు సెప్పుకొని బతుకుతాం."

"పోరాపో... అట్టాగేలేపో... సాటింపు వేయించు. రేప్పొద్దున నేనూ వస్తానులే ఎప్పుడో చానా యేళ్లకిందట మా వూళ్లో నీలాంటి వాడొకడు గారడీ చేశాడు. అంతటితో ఆగకుండా రేకుడబ్బాలు కట్టి మా వూరి చెర్లో సైకిలుకూడా తొక్కాడు". అంటూ పెద్దగా నవ్వి "వాడు మునిగిపోతే మా వాళ్లు లాక్కొచ్చి వొడ్డున పడేశారు". అని మళ్లీ పెద్దగా నవ్వాడు బంగా(రాజు.

సాయిబుకు తను కూడా నవ్వాలో, నవ్వకూడదో తెలీక నవ్వీనవ్వనట్టుగా వుండిపోయేడు.

ఇంకా నవ్వుతూనే "ఏరా నువ్వుకూడా మా వూరి చెర్లో సైకిలు తొక్కుతావా? నిండా నీళ్లున్నాయ్" అనడిగాడు.

'లేద్దొరా... నాకు రాదు' అన్నాడు సాయిబు.

'సర్లేపో... రేప్పొద్దున కనపడు' అన్నాడు బంగా(రాజు ఇకవెళ్లవచ్చు అన్నట్టుగా.

స(త్రానికి తిరిగి వస్తూ మధ్యలో ఆ వూళ్లో చాటింపులు వేసే మనిషిని పట్టుకుని తన గారడీ (ప్రదర్శన గురించి చాటింపు వేసే ఏర్పాటు చేసుకుని వచ్చాడు.

అప్పటికే వంట సిద్ధమయ్యింది. పిల్లలిద్దరూ తిని స(త్రంలో నేలమీద పడి ని(ద్ర పోతున్నారు. సాయిబు భార్య అతనికోసం ఎదురుచూస్తోంది.

చెర్లోదిగి కాళ్లూ చేతులు కడుక్కుని వచ్చాడు సాయిబు.

సత్తుగిన్నెలో అన్నంపెట్టింది భార్య.

"నువ్వు తిన్నావా?" భార్యను అడిగాడు.

"ఆకలేసింది, పిల్లలతో తిన్నా"

అన్నం తింటూనే తను సర్పంచిని కలిసిన వివరాలూ, చాటింపు గురించీ చెప్పాడు సాయిబు.

విని వూరుకుంది.

"సర్పంచి మంచోడు" సాయిబే అన్నాడు చెయ్యి కడుక్కుంటూ గిన్నెతో.

చెరువు కట్టమీదినించి చల్లటిగాలి రివ్వున వీస్తోంది.

స(త్రానికి తలుపులు లేవు. చలిగాలి (ప్రభావం ఎక్కువగానే వుంది. పిల్లలమీద ఇంకో రెండు పాతగుడ్డల్ని కప్పింది సాయిబు భార్య.

గోడవారగా ముడుచుకుని పడుకుని చినుగుల దుప్పటిని కప్పుకున్నాడు సాయిబు. పిల్లల పక్కనే పడుకుంది అతని పెళ్లాం. ఆమె పడుకున్నదేగానీ ని(ద్రవచ్చేట్టుగా అనిపించలేదు. ఒళ్లంతా నలవరింతగా వుంది. నొప్పులుగానూ, విరవిరలాడుతున్నట్టూ, అనిపించింది. చలిగాలి తగులుతుంటే మరింత బాధగా వుంది. జ్వరం వస్తుందేమోనని భయపడింది.

ని(ద్రపట్టని సాధువులు తత్వాలు పాడుతున్నారు.

చెట్లకిందనే కూర్చొని ఎక్కడినించో పడుతున్న లైటు వెలుతుర్లో ముష్టివాళ్లు అన్నాలు తింటున్నారు. హాల్లో పడుకున్న ముష్టి ముసలి వాళ్లూ తిండి తిని ని(ద్రలోకి జారిపోయారు.

సాధువుల తత్వాలు వింటూ సాయిబు ని(ద్రపోయేడు.

(క్రమంగా రేయి గడిచింది.

ఊరు మాటు మణిగింది.

ఎవరో జోకొట్టినట్టు సందడి ని(ద్రించింది.

ఊరంతా ని(ద్రకు ఉప(క్రమించింది.

ఒకరాత్రివేళ సాయిబుకు మెలకువవచ్చింది. చూస్తే భార్య మూలుగుతోంది. చలికి వణుకుతోంది. చెయ్యిపట్టుకుని చూశాడు. కాలిపోతోంది. ఉలిక్కిపడ్డాడు.

జ్వరమా...

"పడుకో... అదే తగ్గుతుందిలే' మూలుగుతూనే అన్నది.

తను కప్పుకున్న చినుగుల దుప్పటిని తీసి భార్యమీద కప్పాడు. ఐనా చలి ఆగలేదు. జ్వరంతో వచ్చిన చలి అంత సులభంగా ఆగదని అతనికి తెలుసు.

ఇప్పుడు తను చెయ్యగలిగింది ఏదీ లేదని తెలిసినా అతను పడుకోలేకపోయాడు. భార్య మూలుగుతూనే ఉంది. వణుకుతూనే ఉంది. చివరకు ఎప్పటికో సాయిబుకు కునుకు పట్టింది. మెలకువ చ్చేసరికి తెల్లారింది.

కానీ, భార్య జ్వరం తగ్గలేదు. ఇంకొంచెం పెరిగింది. సర్పంచిని కలిసి తను ఆపూట గారడీ ప్రదర్శన ఇవ్వటం లేదని చెబుతానన్నాడు సాయిబు. ఆయనకు కోపం వస్తుందేమో అన్నది భార్య.

ఐనా సాయిబు వినలేదు. అతనిమనసు మనసులో లేదు. భార్యకు జ్వరమొస్తే అతను భరించలేడు. ఆమెకు అలా వుంటే అతను గారడీ ప్రదర్శన ఇవ్వలేడు.

సర్పంచికి కోపమొచ్చినాసరే, తను ఈ ప్రదర్శన ఇవ్వలేడు. అయినా ఆయన మంచివాడిలా వున్నాడు. తన బాధను అర్థం చేసుకోగలడు.

సాయిబు ఇలా అనుకుని సర్పంచివున్న ఇంటికి వెళ్లాడు. ఉయ్యాల బల్లమీద కూర్చుని టిఫిన్ తింటున్నాడు బంగార్రాజు.

సాయిబును చూడగానే "ఏరా.. అంతా రెడీయేనా?" అనడిగాడు.

"లేద్దొరా... ఈ పేటకు నేదు"

"ఎందుకురా?" నొసలు చిట్లించి అడిగాడు.

"నా ఆడోళ్లకు జొరమొచ్చింది"

"ఐతే?" అర్థం కానట్టు బంగార్రాజు అడిగాడు.

'నిజం సెపుతున్నాను మారాజా.. దానికి వొంటో వుసారుగా నేకపోతే నేనేమీ సెయ్యలేను... కాలూ సెయ్యాడదు. దానికి రేత్తిరినించీ జొరం సలసల కాగుతోంది. తవరు నాలుగు రూకలు కనికరిత్తే దానికి జొరం తగ్గడానికి సూది మందేయిత్తాను.

ఆ మాటలతో బంగార్రాజు కోపంతో వూగిపోయేడు.

టిఫిన్ తిన్న ప్లేటును సాయిబు మీదకు విసిరి "ఏంట్రా... దేశంలో నీకేనా పెళ్లాముంది? నీకేనా

## అక్బర్ చిత్రకళా ప్రదర్శన

తెలుగు పత్రికలు, పుస్తకాలు చదివే వారికి అక్బర్ అనగానే నాటి మొఘల్ చక్రవర్తి గుర్తుకురాకపోవచ్చు. అనంత కోటి బాధలు, దుఃఖాలు, దారిద్ర్యాలతో దినమొక గండంగా గడుపుతోన్న వర్తమాన సమాజంలోని ఎందరెందరో తన కుంచెతో రూపుకట్టే చిత్రకారుడు అక్బర్ మాత్రమే గుర్తుకు రావచ్చు! నిజమే! తన కళలో చక్రవర్తి అక్బర్! చిత్రకళని వృత్తిగా స్వీకరించిన అక్బర్ ఇప్పటివరకు ఎనిమిది వందలకు పైన్నే పుస్తకాలు ముఖ చిత్రాలుగా మారారు. ఆంధ్రజ్యోతి ప్రచురించిన అప్పటి రాష్ట్రపతి కె.ఆర్. నారాయణన్ ముఖ చిత్రం స్వయంగా రాష్ట్రపతి మనసుదోచుకొంది. హార్వార్డ్ విశ్వవిద్యాలయం ముచ్చట పడి అక్బర్ చిత్రాల్ని తన ప్రదర్శనాలయంలో ప్రదర్శిస్తోంది. ఎందరెందరో విదేశీయులు అక్బర్ చిత్రాలపై మోజు పెంచుకొన్నారు.

ఈ ముప్పై ఏడేళ్ల ఖమ్మం కుర్రాడు ఫైనార్ట్స్‌లో డిగ్రీలేవీ లేకుండానే ఇన్ని విజయాలు సాధించారంటే నమ్మలేం. చూపు, మరోదారి, దళిత్ వాయిస్, ప్రజాశక్తి ప్రచురణపై కనిపించే అక్బర్ ఇన్నేళ్ల చిత్ర జీవితంలో డిసెంబరు 24 నుంచి 29 వరకు ఎనెక్ డోట్స్ పేరుతో హైదరాబాదు 'లక్షణ' ఆర్ట్ గ్యాలరీలో తన చిత్ర ప్రదర్శన జరిపారు. శత సహస్ర ముఖాలుగా అక్బర్ చిత్రకళని ఆక్రమిస్తారన్న నమ్మకం కలిగించారు.

– సి. హెచ్. లక్ష్మి

పెళ్లాంమీద ప్రేమ ఉంది? అది చచ్చినా సరే... నువ్వు ముందు చెప్పినట్టుగా గారడీ ప్రదర్శన ఇవ్వాల్సిందే" అన్నాడు కటువుగా.

ఉలిక్కిపడ్డాడు సాయిబు. బంగార్రాజుకి అంత కోపం ఎందుకు వచ్చిందో అతనికి అర్థం కాలేదు.

ఎదురుగా నిలుచున్న సాయిబు తనని హేళన చేస్తున్నట్టుగా అనిపించింది బంగార్రాజుకి. అతనికి అగ్ని సాక్షిగా పెళ్లాడిన భార్య బతికే వుంది. అయినా తన విలాసాలకు అతను ఇంకో ఇంటిని ఏర్పాటు చేసుకుని అందులో ఇంకో ఆడదాన్ని కొలువుంచాడు. ఎప్పుడయినా చేసుకున్న భార్య మొహాన్ని చూస్తాడు. ఆమె ఏ రోగమొచ్చినా పట్టించుకోడు. ఆమె కష్టాలతోనూ, దుఃఖాలతోనూ అతనికి పనిలేదు. అతని సుఖం అతనిదే.

ఇదంతా తెలియని సాయిబు ఆశ్చర్యానికి లోనయ్యాడు. తనమాటల్లో తప్పు ఏమిటో అర్థం కాలేదు.

"వెళ్లు... వెళ్లి ప్రదర్శన మొదలుపెట్టు" ఆజ్ఞాపించినట్టుగా అన్నాడు బంగార్రాజు.

"మన్నించు దొరా... దయగల ప్రెబువులు... వొత్తిడి పెట్టకండి... దాని జొరం నిదానించాక పెదరశన మొదలుపెడతాను"

"కాదు... ఇప్పుడే ఇవ్వాలి" గట్టిగా అరిచాడు.

"దొరా... నావల్లకాదు... అదట్టావుంటే నా పేనం నిలవదు... చెమించండి... నా బాద నేంపడతాను."

సాయిబు వెనక్కు తిరిగాడు.

"ఒరేయ్.... వెళ్ళు... మళ్లీ నువ్వే నా కాళ్లదగ్గరకొస్తావ్... ఈ వూరు నా గుప్పిట్లో వుంది. నేను చెప్పిందే వేదం. నేను చేసిందే శాసనం. ఈ వూళ్లోనే నీ పెళ్లాం జొరంతో కాలి చచ్చిపోవాలి. ఒక్కరూ సహాయం చెయ్యరు".

బయటకు వచ్చాడు సాయిబు.

అప్పటికప్పుడే బంగార్రాజు ఆ మోళీ సాయిబు కుటుంబానికి ఎవరూ ఎటువంటి సాయాన్నీ చెయ్యకూడదని చాటింపు వేయించాడు.

ఆ కారణంగానే బంగార్రాజుతో శత్రుత్వం తెచ్చుకోవటానికి ఇష్టపడక సాయిబు ఎంత ప్రయత్నం చేసినా అతడి భార్య జ్వరం తగ్గటానికి ఎవ్వరూ ఎటువంటి సహాయమూ చెయ్యలేదు. అంతేకాదు. ఆ వూళ్లో వాళ్లకు ఒక్క ముద్ద అన్నంకూడా దొరకలేదు. వండుకోటానికి తిండిగింజలు కూడా లేవు. సాయిబు పిల్లలు ఆకలితో అలమటించారు. అతడి భార్య జ్వరంతో మూలుగుతూ పడిఉంది. సాయిబు భార్య దగ్గర దిగాలుపడి కూర్చున్నాడు.

ఆ దృశ్యాన్ని గంజాయి పీల్చి తత్వాలు పాడే సాధువులు చూశారు. విషయాన్ని తెలుసుకున్నారు. తాము అడుక్కుని తీసుకువచ్చి అన్నాన్ని పిల్లలకు పెట్టారు. తమ దగ్గర ఉన్న మూలికల మందును సాయిబు భార్యకు ఇచ్చారు. వాళ్లే అన్నం పెట్టారు సాయిబుకి. ధైర్యం చెప్పారు.

సూర్యుడు ఆకాశంమీద పాకి అలసిపోయి పడమటి కొండల దిశగా ప్రయాణం సాగించాడు.

ఆ సాయంత్రానికి సాయిబు భార్యకు జ్వరం నెమ్మదించి క్రమేపీ తగ్గిపోయింది. సాయిబు సంతోషానికి అవధుల్లేవు. ఆమె తిరిగి నవ్వింది.

ఆ రాత్రి కూడా సాధువులే వాళ్లకు అన్నంపెట్టారు. ఆప్యాయంగా పలకరించారు. ఆ సాధువులకు సాయిబు కృతజ్ఞతలు చెప్పుకున్నాడు.

చీకటి పడింది.

చెరువు మీదినించి చల్లటిగాలి వచ్చి వాళ్ళని పలకరిస్తోంది.

సాయిబు ఆలోచిస్తున్నాడు.

అతడి భ్రమ తొలగింది.

జ్వరం తగ్గిందికదాని మర్నాటి పొద్దున ఆ వూళ్లో ప్రదర్శన ఇద్దామా అని అడిగింది భార్య. వెంటనే వద్దన్నాడు సాయిబు, మరో ఆలోచనకు తావు లేకుండా...

రేయి గడుస్తోంది.

అతనికి నిద్రపట్టలేదు.

లేచాడు. భార్యాపిల్లల్ని లేపాడు. సామాన్లన్నింటినీ మూటలు కట్టి కావిడికి తగిలించాడు. కావిడిని భుజానికి ఎత్తుకున్నాడు. భార్యాపిల్లలతో సత్రం బయటకు నడిచాడు.

డబ్బున్న మనుషులుండే డాబాలూ,మేడల మధ్యనించి నడుస్తూ- చీకట్లు ఇంకా విచ్చుకోక ముందే మోళీసాయిబు భార్యా పిల్లలతో ఆ వూరి పొలిమేరలను దాటి వెళ్లిపోయాడు. ■